కన్నడగౌళ - ఝంప

కామయాగముజేసె - గలికితన
ప్రేమమే దేవతా - ప్రీతిగాను

పొలు పలర సురతతాం - బూలరస పానంబు
నలినాక్షి సోమ పా - నంబు గాను
కల కలంబుల మంచి - గళరవమ్ముల మ్రోత
తలకొన్న వేద మం - త్రములు గాను

పడతి తన విరహ తా - పమున బుట్టినయగ్ని
అడరి దరికొన్న హో - మాగ్నిగాను
ఒడబడిక సమరతుల - నుదయించిన జెమట
దడియుటేయది యవ భృ - థంబు గాను

తనరకుచముల రుచులు - దంతాక్షత క్రీడ
ననుపైన పశు బంధ - నంబు గాను
యెనసి శ్రీ తిరువేంక - టేశ్వరుని పొందు
ఘనమైన దివ్య భో - గంబుగాను

కాముని జన్నము చేసినది ఆ కలికి అలమేల్మంగ ఆ మన్మధ యజ్ఞములో దేవతాప్రీతి రూపమైనది ఆమె ప్రేమ. నాయికా కృతమైన వైదిక ప్రక్రియగా సంభోగ శృంగారాన్ని నెలకొల్పారు అన్నమాచార్యులవారు. వేదంలో సహితము రతిక్రియ ఇలాగే హోమ ప్రక్రియగా వర్ణింప బడ్డది. సాహిత్యంలో స్మరయాగ సంప్రదాయాన్ని వెలయించినది అన్నమాచార్యులే. ఈ సంకీర్తనలో నాయిక తన శృంగారపు, సౌందర్యపు సామగ్రిని యజ్ఞోపయుక్త వస్తువులు చేసి వైదికక్రమం పాటించడము విశేషం.

కలికి చేసిన కామయాగంలో ఒడికమైన సురతపు తాంబూల రసపానమే సోమరసపానమై, తద్యజ్ఞ కర్మ నిర్వహింపబడినది. ఆమె శృంగార సంరంభ కలరవాలూ, రతికూజితధ్వనులూ, పూత్కారాలూ - అన్నీ స్మరయజ్ఞ విధికి వేద మంత్రాలై ఒనరినవి.

తన విరహతాపంవల జనించిన కామాగ్ని రగులుకొని రాజుకొన్న హోమాగ్నిగా వ్రేల్చినది ఆమె. పరస్పరం అంగీకృతమైన సమరతుల శ్రమచే జనించిన చెమటలో తడిసి,

తన కాముని యజ్ఞాని కామె అవభృద స్నానం ఆచరించినది అవభృదం యజ్ఞాంతంలో చేసే పుణ్యావాహన పవిత్రీకరణ స్నానం.

ఆమె తన స్తనముల మెఱుగులు పలుగాట్ల గుర్తుల విరియించు ప్రక్రియ యజ్ఞ కర్మ అయిన పశుబంధనం లాగున నిర్వర్తించినది.శ్రీవేంకటేశ్వరుని తోడిపొందు దివ్య భోగమైన యజ్ఞ ఫలప్రాప్తి అయినది ఆమెకు. ఆకంతు క్రతువులో పశు బంధనం ఉన్నదే గాని పశుబలి ఎక్కడాలేదు ఈ కీర్తనలో.స్త్రీలొనరించే యాగాలలో పశు బలిదానాలు నిషిద్ధం. వైదిక ధర్మప్రకారం స్త్రీలకు బలిఇచ్చే అధికారం లేదు. (ఒక్క వామాచారంలో తప్ప కౌల వామాచారుల శ్రుతిబాహ్యులని వైదికుల, సమయాచారుల మతం) ఈ వైదిక ధర్మౌచిత్యాన్నే పాటించారు అన్నమాచార్యులు.